స్వచ్ఛమైన అబద్ధం

"నెమలి"

జానకీ, వాళ్ళమ్మా, ఒకరినొకరు చాలా ప్రేమించుటవలన, వారివారిమనసులను నొప్పికలుగకుండునట్లు నిజమును దాచిన, అది అబద్ధమనతగునా?...

ప్రపంచమంతా తాకివస్తున్న చలి, ఆ చిన్నియింట్లో ప్రవేశించక మాస్తుందా? ఇంటి వెనకభాగం. చీకటికొట్లో జానకి, వాళ్లమ్మమ్మ పక్కమంచంపై ముడుచుకునికూర్చొంది. అమ్మమ్మ యీ లోకంవిడచి చాలా రోజులయికూడాను ఆ చీకటికొట్టింకా అమ్మమ్మకొట్టే. తన లేతచేతుల్ని వెచ్చగావుంచుకోడానికి పరికిణీతో కప్పుకుంది జానకి. తనక్కడ కూర్చుంటే వాళ్లమ్మకు తెలియదుగా!

అమ్మ తెమ్మన్న దారపుంట నడుములో చెక్కింది, యింకా అలాగేవుంది. గ్రుచ్చుకుంటూవుంది కూడాను. బడినుండి వచ్చినవెంటనే అమ్మకివ్వలేదు తను. కాని యిప్పుడే అమ్మ మొహం యెలాచూడటం? అబ్బ! ఇవ్వాళ బళ్ళో తనకెంత అవమానం జరిగింది! అదిగో సుబ్బిశెట్టి అంగడి. జానకి దారపుంటకోసం దుకాణంలోనికి వెళ్లింది. అక్కడేవున్నది కమలకూడాను. తన స్నేహితురాండ్రు విమలా, సరళ, శకుంతల, సావిత్రులతో అందరూ సెల్యూలాయిడ్ బొమ్మలూ, పుట్టిన పండుగ పత్రికలూ చూస్తున్నారు. ఎంచక్కా వున్నాయి! రంగురంగుల బొమ్మలు! తన కెప్పుడూ అలాంటి బహుమానములు రాలేదు. తనపుట్టినరోజుకి అమ్మే అన్నీ చేస్తుంది. అమ్మ చేసినవెంతో బావుంటాయి. అవును చాలా బావుంటాయి. అయితే-కమలో? కమల తన స్నేహితులతో "ఏమర్రా నాపుట్టినరోజుకి, చక్కని బొమ్మలు రాసిన ఆహ్వానపత్రికలు తెప్పిస్తారట. మిమల్నందరినీ పిలిచాననుకోండి" అంటున్నది. జానకిని పిలవలేదు. తనవైపు చూడనూలేదు. తనతో మాట్లాడనూలేదు. ఫరవాలేదు! ఏంమునిగిపోయింది పిలవకపోతే? ఫరవాలేదు! అనుకుంటూ కూర్చుంది జానకి. కండ్లు గట్టిగా మూసేసుకుంది. పాపం! అశ్రుధారని నిలుపుకుందామని కాబోలు!

"జానకీ! జానకీ!" అమ్మ పిలుస్తున్నది కాని తను వినిపించుకోలేదు. కండ్లు మూసుకొని మనోరాజ్యంలో విహరిస్తున్నదా? మనోవేగంతో గ్రామంలో వాళ్లింటికి పయనంచేసింది. వాళ్లతోటలోని చక్కని రోజా, మల్లె, సంపెంగపూలు ఒడినిండాపోసుకొని, అమ్మకోసం తీసికెడ్తూ, మామిడిచెట్టుపై కోయిలకూయడం వింటూ అలాగే నిలబడిపోయింది. అమ్మకి పూలసరం గ్రుచ్చి, కోయిల పాడినపాటను పాడి వినిపిస్తే!

గలగలా ప్రవహిస్తున్న చిన్న నదిప్రక్కన నిలుచుంది. ఆ సెలయేరుకూడా పాటపాడుతూవుంది! ఒక పడిపోయిన చెట్టు తొఱ్ఱపై కూర్చుంది. ఇంతలో వాళ్లకుక్క ఫ్రిస్కీ పరుగెత్తుకుంటూ వచ్చింది. తన్ని చూసి నవ్వి, వంగి నమస్కారంచేసింది. అరే! మొఱుగలేదే!

"నమస్తే జానకీ!"

ఫ్రిస్కీ నిన్ను విడచివుండటం యెలావుందనుకున్నావే? అబ్బ నాకు పట్నంలోవుండటం యిష్టమే లేదు. అయితే ఏంచెయ్యటం? నాన్నారికి పెద్దనష్టమొచ్చి, గ్రామంలో భూములన్నీ అమ్ముకుని పట్నం

వెళ్లవలసివచ్చింది. పట్నం అసహ్యంగావుంది. మాబడికూడా అలాగేవుంది. ఫ్రిస్కా నువ్వూ మాతోవచ్చి వుంటే యెంతబావుండేది?" అన్నది జానకి. తన మనసులోనివేదన అంతా ఫ్రిస్కాకు చెప్పుకుంటూ. ఫ్రిస్కా, జానకి నోదార్చి, అలా కంగారుపడకూడదనీ, నాన్నారిని తొందరచెయ్యకూడదనీ, అమ్మకు సాయం చెయ్యమనీచెప్పి, తోకాడించుకుంటూ వెళ్లిపోయింది.

జానకి కండ్లుతెఱచింది. ఆ చీకటిగది మరీ చీకటిగావుంది. ఏమీ కనుపించటంలేదు. కాని భయంకరమైన రూపాలు తనచుట్టూ తిరుగుచున్నాయి. ఎంతఘోరంగా వున్నదాగది? తన ప్రేగుల్లోనుండి పుట్టుకొస్తూంది ఆ భయం. ఎందుకో? నాన్నారికి నష్టం వచ్చుండకపోతే - అలాగయితేనా-నాన్నారెప్పుడూ అలా కోపంగావుండరు. అసలు రాత్రిళ్లు పనిచేయనక్కరలేదు. అన్నిటికంటే ముఖ్యం ఫ్రిస్కా వుండేది తనతో. అప్పుడు బళ్ళోపిల్లలందటికీ తనంటే యెంతో ఆపేక్షవుండేది. జానకి వూహాలన్నీ ఆ భయంచుట్టూ తిరుగుతున్నాయి. తనంటే ఎవ్వరికీ యిష్టంలేదనేభయం.

ఆ రోజు యింకా కండ్లకు కట్టినట్లుంది. రాత్రి వాళ్లయిల్లువదలి, యీయింటికి వచ్చేశారు. అమ్మ యేడుస్తూవుంది. ఫ్రిస్కా వాళ్లతోరాలేదు. క్రొత్తయిల్లు సర్దుకోవటంలో రోజులు గడిచిపోయినాయి. మళ్ళా యివ్వాళ దుకాణంలోవచ్చింది అభయం. తనకూ ఆహ్వానపత్రికరావాలి. ఎలాగైనారావాలి. వాళ్లందరికీ తనమీద యిష్టంకలిగితే యీ భయంపోతుంది. కాళ్లూ, చేతులూ చల్లబడ్డాయి. చెవులు గింగురుమంటున్నాయి. మొదట ఏడుపుశబ్దంవిని తన చెవులే గుయ్యిమంటున్నాయనుకొంది. మళ్లీ వినబడింది అదే శబ్దం.

మంచంమీదనుండి ఒక్కగెంతుతో పడకగదివైపు పరుగెట్టింది. తలుపుతోసి అలా చూస్తూ నిలబడింది. కండ్లింత పెద్దవిచేసుకొని తనుచూసే దృశ్యం నమ్మలేకపోయింది. అమ్మ పట్టుమిషనుపై తల పెట్టుకొని వెక్కివెక్కి యేడుస్తూవుంది. అమ్మ కుడుతున్న తెల్లటిబట్ట నలిగిపోయి క్రిందపడివున్నది. అమ్మ ఏడుస్తూవుంది!

"అమ్మా!" ఆ చిన్ని హీనకంఠస్వరం ఆమెకు వినబడనేలేదు. అమ్మ మెడన్నుచేతులతో పెనవేసుకొని జానకికూడా యేడుస్తూవుంది. అమ్మ తిరిగిచూచి తన కన్నీళ్లుతుడుచుకుంది.

"ఎందుకమ్మా యేడుస్తున్నావ్?" అని కమ్మిపోయిన గొంతుతో అడిగింది జానకి.

మృదుహస్తములు జానకిభుజాన్ని తడుముతున్నాయి. "చిట్టితల్లీ నేనొకరహస్యం చెబుతావిను. ఎవ్వరితో చెప్పవుకదూ?"

జానకి యేడుస్తూ మొహంపైకెత్తింది. రెండుకండ్లలో రెండునీటిచుక్కలు నిలచివున్నాయి - అమ్మ చెప్పే రహస్యం వినడంకోసం. అమ్మ మెల్లగా జానకిచెవిలో,

"ఇంక కొద్దిరోజుల్లో మన యింటికో చిన్నపాపాయొస్తుంది. నీకు చిట్టిచెల్లెలో, తమ్ముడో. చిట్టి తమ్ముడు కావాలా?" అన్నది.

జానకి యేమీచెప్పలేదు. సంతోషం, భయం, సిగ్గూ అన్నీకలసిపోయినాయి తనకి. అమ్మ ఒడిలో తలపెట్టుకొని చాలాసేపు కూర్చుంది. ఆఖరుకి వాళ్లమ్మ,

"ఏమ్మా, నీకు సంతోషంగా లేదూ? చిన్నపాపాయొస్తే బావుండదూ?" అని అడిగింది.

"అమ్మా, నీకు సంతోషంలేదే! నువ్వు యేడుస్తున్నావుగా!"

"చిట్టితల్లీ, నేను యేడ్చినదెందుకో తెలుసా? ఎందుకంటే - నాకు - చాలా సంతోషంగావుంది."

"అయితే నాకూ సంతోషమేనమ్మా."

ఇంతలో నాన్నారు మేలుకొన్నారు. నాన్నారికీ రహస్యం తెలుసా? అమ్మనడుగుదామనుకొంది జానకి. ఇంతలోకి అమ్మలేచి, "అసలు మరిచేపొయ్యాను. ఇవ్వాళ నీకోగమ్మత్తు వచ్చింది, కండ్లు మూసుకో" అని నవ్వుతూచెప్పింది. జానకి కండ్లుమూసుకొంది.

"ఏదీ; నీకే చేతులోది కావాలో చెప్పుకో."

"రెండూ కావాలి."

"అమ్మో! అవ్వాకావాలి, బువ్వాకావాలా? ఇదుగో తీసుకో" అని అమ్మ ఓపెద్ద కవరు యిచ్చింది. జానకి గబగబా విప్పిచూచింది. ఆహ్వానపత్రికే. అవును. తనకేవచ్చింది. "హై! హై! ఇంకేం. అమ్మా నన్నూ పిలచిందే కమల. తన పుట్టినరోజుకి. అయితే యిదేమిటీ? త-మా-షా-వే-షా-లు, అంటే ఏంటమ్మా?"

"ఏమీలేదు. నువ్వో చక్కనిపిల్లలాగో, లేక కథల్లోవచ్చే తమాషావేషాలో వేసుకోవాలి. నువ్వేలా వుంటావు?"

"అమ్మా నేనో చక్కటి అమ్మాయిలాగ వెడతానే! అయితే నాకు చక్కటి పరికిణీచొక్కా లేవుగా!"

"ఫరవాలేదు. నాదగ్గర మంచిబట్టవుంది. నీకు కుట్టిస్తానులే."

"తక్కిన పిల్లలు కొంటారేమో -"

"తరువాత చూద్దాం. వెళ్లి ఆడుకో. నాన్నారికి పనివేళయింది, వడ్డించాలి. వెళ్లు, వెళ్లు,"

"అలాగే." జానకి సంతోషంతో గంతులేస్తూ వెళ్లిపోయింది, తనకీ పిలుపొచ్చింది!

నాన్నారు భోంచేసి వెళ్లిపోయారు. జానకీ, వాళ్ళమ్మా, మేడమీదికెళ్లారు. కమలకు, అమ్మకుట్టిన, పూలతో చక్కగావున్న చేతిరుమాలు, బహుమానంగా యివ్వటమని తీర్మానించారు. ఇక జానకి, పరికిణీకో? అప్పుడే అమ్మకు జ్ఞాపకమొచ్చింది. ఓ పెట్టినుండి అందమయిన కాగితంతీసింది. దేనికోసం? తనకేనట! అమ్మ చెబుతూవుంది. ఆ కాగితంతో చక్కని పరికిణీ, చొక్కా, ఆమ్మ కుడుతుందట! ఇంకేం! కమలకు బహుమానం, తనకు క్రొత్తవేషమూ వున్నాయిగా, జానకి హాయిగా నిద్దరోయింది.

ప్రొద్దునలేవంగానే జానకి తనపరికిణీ చూచింది. ఎంతబావుంది! పసుపూ, తెలుపూ, రేకులతో విచ్చిన తామరపూవులావుంది పరికిణీ! ఆకుపచ్చటి చొక్కా. అంతా ఆకాగితంతో చేసినదే. ఆరోజంతా యెలాగ గడచిపోయిందో తనకు తెలియదు. మధ్యాహ్నం మూడుగంటలకే, తనపరికిణీ, చొక్కా వేసుకుంది. చక్కగా తలదువ్వుకొని, రుమాలు, ఓ చిన్నపెట్టిలో పట్టుకొని, కమల యింటికివెళ్ళింది. కమల నాన్నారికి చాలా ధనంవుంది. పెద్దభవనంలోవున్నారు వాళ్లు. కమలయింట్లో వాళ్లమ్మ, జానకితెచ్చిన బహుమానం తీసికెళ్లి బల్లమీదపెట్టింది. ఆ బల్లమీదే ఎన్నోబహుమానాలున్నాయి. వాటిలో తన చిన్నిపెట్టి కనబడుతుందా? కమలకు తనుతెచ్చిన దేదో తెలుస్తుందా? కమల, తన స్నేహితురాండ్రు, చక్కటి పట్టుపరికిణీలు, సిల్కుగౌనులు వేసుకొని ఆడుకొంటున్నారు. అందరివీ బనారసుపట్టు పరికిణీలే.

ఇంతలోకి కమల గబగబా వచ్చి జానకిచెయ్యిపట్టుకొని

"జానకి నావేపు" అన్నది.

"కాదు, కాదు, నావేపు" అని మరోచెయ్యిపట్టుకుంది శకుంతల. ఇద్దరూలాగారు. జానకి ఆనందాన్ని చెప్పనవసరములేదు. వాళ్లకి తనుకావాలట! వాళ్ళందరకూ తనంటే యెంతయిష్టమో!

కమలా, శకుంతలా లాగటంలో క్రిందబడ్డారు. వారితోకూడా జానకి. పరికిణీలో ఒక తామర రేకు వూడిపోయి వ్రేలాడుతూవుంది. మొహం ఎఱ్ఱబారింది. తలవంచేసుకొని యేడుద్దామనిపించింది. తక్కిన పిల్లలందరూ యీవింతజూచి నవ్వటం మొదలెట్టారు. తనచుట్టూ తిరుగుతూ, చప్పట్లుకొడుతూ,

"కాగితంతో చేసిన పరికిణీ కట్టుకుందీ,
వొయ్యారంగా వచ్చిందీ - పుట్టినరోజుకీ,
కాగితంపరికిణీ - కాగితంపరికిణీ,"

అని వెక్కిరిస్తూ గోలచేస్తున్నారు. ఇంతలోకి కమల తల్లివచ్చి "ఛా! ఇప్పుడే నిలపండి. జానకి నలా యెందుకేడిపిస్తారు' చాలు, చాలు. కమలా, నువ్వుకూడా నీ అతిథి నలా చేయవచ్చునా? వూరుకోండి. అని నాలుగు చీవాట్లుపెట్టి, జానకిని మరోగదిలోకి తీసికెళ్ళి, ఆ రేకును యథాప్రకారం కుట్టింది.

"ఎంత బావుంది నీ పరికిణీ, మీ అమ్మ యెంత తెలివిమంతురాలో, యిలా కాగితంతో కుట్టడానికి" అని సమాధానంగా యెన్నో చెప్పింది. కాని జానకిగుండెలోని భారం అలాగేవుంది. ఏమీ బదులు పలకలేదు. మళ్లీ కమల వాళ్లుండేగదికి తీసికెళ్లారు.

ఈసారి జానకివైపు ఒక్కమ్మాయికూడా చూడలేదు. వారిలోవారు ఆడుకున్నారేగాని జానకిని పిలవలేదు. జానకి మనస్సులో ఒకటే ఆలోచన. ఎప్పుడు అయిదున్నరగంట అవుతుందాఅని. అప్పుడు వెళ్లిపోవచ్చునుగా. మనస్సులో దేముణ్ణి ప్రార్థించింది అయిదున్నర కానివ్వమని. ఎప్పటికీ కాలేదు. తాను వాళ్లముందే చనిపోతే బాగుండుననిపించింది. అప్పుడైనా వాళ్లు పశ్చాత్తాపపడతారుగా! ఇంటికి వెళ్లటానికీలేదు. అమ్మతో అయిదున్నరకేగా వస్తానన్నది. ఇప్పుడేవెడితే ఏంచెప్పడం?

కమల తన బహుమానాలన్నింటినీ చూస్తోవుంది. తను తెచ్చిన రుమాలు చూసైనా సంతోషిస్తుందా? లేదు. ఆ రుమాలు తీసినప్పుడు కమల తనవంకైనా చూడలేదు. జానకి, కమల తల్లిని అయిదున్నరయిందా అని అడిగింది. లేదన్నదావిడ. వాళ్ళందరికీ తినటానికి లడ్లూ, మైసూరుపాకులూ తెచ్చారు. తనకేమీ తినాలనిపించటంలేదు. ఆఖరుకి అయిదున్నరకొట్టింది. కమల తల్లి, పిల్లలందరికీ మిఠాయిపొట్లములు పంచి యిచ్చినది. జానకి తన పొట్లంతీసుకొని వాళ్లదగ్గర సెలవుపుచ్చుకొని వేగంగా యింటికివెళ్లింది. అసలు కమల గారింటి వీధిమలుపు తిరగంగానే పరిగెత్తటం మొదలెట్టింది.

ఇంటికిరాగానే వాళ్ళమ్మ, "జానకీ వచ్చావమ్మా? ఎలావుండింది కమల పుట్టినరోజు పండగ!" అన్నది.

"ఎంతో బావున్నదమ్మా, కమలా, విమలా బనారసు పరికిణీలు కట్టుకున్నారు. మాకు, మైసూరు పాకులూ, లడ్లూయిచ్చారు. మేము తమాషాగా యెన్నోఆటలు ఆడుకొన్నాం. ఇదిగో నీ కీమిఠాయి పొట్లం తెచ్చాను." అమ్మ వంగి పొట్లం తీసుకొంది, అప్పుడు చూసింది, జానకి కండ్లలో ధారలుధారలుగా నీళ్లుకారటం.

"చిట్టి తల్లీ, యెందుకేడుస్తున్నావమ్మా? నీతో యెవరూ ఆడుకోలేదు?"

"ఓ అందరూ ఆడుకున్నారు. నే నెందుకేడుస్తున్నానో తెలుసా? ఎందుకంటే - నాకు సంతోషం యెక్కువ అవటంవలన" అని అమ్మనిచూచి చిఱునవ్వు నవ్వింది జానకి......